క్లుప్తంగా

రాచర్ల ఏపీవోగా మహాలక్ష్మి


మహాలక్ష్మి

రాచర్ల: రాచర్ల ఏపీవోగా మహాలక్ష్మి సోమవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జిగా పని చేస్తున్న అర్ధవీడు ఏపీఓ శ్రీనివాసరెడ్డి స్థానంలో కొమరోలు ఏపీవో మహలక్ష్మిని బదిలీ చేశారు. ఆమె సోమవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి


సామగ్రితో ఉపాధ్యాయులు, దాతలు

పొదిలి రూరల్: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక పాఠశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చీమకుర్తిలోని మిడ్‌వెస్ట్ గ్రానైట్ సంస్థ రూ.70 వేల విలువైన సామగ్రి అందజేసింది. పాఠశాలకు అవసరమైన 3 బీరువాలు, 4 టేబుళ్లు, 10 కుర్చీలు అందించిన మిడ్‌వెస్ట్ యాజమాన్యాన్ని ఎంఈఓ అభినందించారు. ఆ సంస్థ ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ జనరల్ మేనేజర్ నతానియేల్, మేనేజర్ జగదీష్, ఏఓ శివప్రసాద్‌రెడ్డి, మిడ్‌వెస్ట్ గ్రానైట్ ఏఓ శ్రీనివాస్, హెచ్‌ఎం జి.వసంత కుమార్, సర్పంచ్ యేసేబు, సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రముఖ గైనకాలజిస్టు శివకుమారి మృతి


డాక్టర్ శివకుమారి(ఫైల్)

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ శివకుమారి(70) అనారోగ్యంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆమె గతంలో మార్కాపురం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌గా సేవలందించారు. ఆమె భర్త డాక్టర్ పిచ్చిరెడ్డి తిప్పాయిపాలెం, గజ్జలకొండ పీహెచ్‌సీలో వైద్యుడిగా, మార్కాపురం జీజీహెచ్‌లో బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జిగా సేవలందించారు. డాక్టర్ శివకుమారి మృతికి పలువురు వైద్యులు సంతాపం తెలిపారు.

విద్యామిత్ర కిట్ల తనిఖీ


సిబ్బందికి సూచనలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ రమేష్‌కుమార్

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే విద్యా మిత్ర కిట్ మండల స్టాక్ పాయింట్‌ను స్టేట్ అబ్జర్వర్ పి.రమేష్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా సరఫరా చేసిన కిట్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. మండల స్థాయిలో విద్యార్థుల వివరాలను ఎమ్ఈఓ కె.శర్వాణి తెలిపారు. ఆయన వెంట సమగ్ర శిక్ష సీఎంఓ కూడా ఉన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమై పలు సూచనలిచ్చారు. జెడ్పీ హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

- సబ్‌కలెక్టర్ త్రివినాగ్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పరిధిలోని నరసింహాపురం గ్రామంలో త్వరలో నిర్వహించనున్న భూముల రీసర్వేకు అందరూ సహకరించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ కోరారు. సోమవారం రాత్రి తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే గ్రామ సభపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో ఉండే వారందరూ రీసర్వే జరిగే సమయంలో తమ డాక్యుమెంట్లతో రావాలని తెలిపారు. రీసర్వే కూడా పకడ్బందీగా చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

19న మూలపెద్దమ్మ తిరునాళ్ల

గిద్దలూరు రూరల్: మండలంలోని కొమ్మునూరులో ఈ నెల 19న మూలపెద్దమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటుగా భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. 19వ తేదీ రాత్రి పాటకచేరి, 20వ తేదీన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


బేస్తవారిపేటలో ఆధార్ సెంటర్ వద్ద భారీగా వేచిఉన్న ప్రజలు

పసివాళ్లు.. పడిగాపులు

- చిన్నపాటి సమస్యలతో ఆధార్ సేవలు బంద్

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు, బేస్తవారిపేట సచివాలయాల్లో చిన్నపాటి సమస్యలతో ఆధార్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిన్నర నుంచి బేస్తవారిపేట, గలిజేరుగుళ్ల, పూసలపాడు సచివాలయాల్లో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. మండల ప్రజలు ఆధార్ నమోదు, చేర్పులు–మార్పులు, ఈకేవైసీ, ఆధార్ అప్‌డేషన్ కోసం కంభం పరిసర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యను గుర్తించిన ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గలిజేరుగుళ్లకు సంబంధించిన కేంద్రం పనిచేసే విధంగా చర్యలు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. రోజుకు వంద టోకెన్లు ఇచ్చి ఆధార్ నమోదు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్న పిల్లలతో సహా ఆధార్ కేంద్రం వద్ద తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. ఇదిలా ఉండగా టోకెన్లు దక్కక వందల మంది వెనుదిరిగి వెళ్లక తప్పడం లేదు. బేస్తవారిపేట ఆధార్ నమోదు కేంద్రంలో కనెక్టర్ పనిచేయకపోవడం, పూసలపాడు సచివాలయంలో ఆపరేటర్ లేకపోవడంతో రెండు కేంద్రాలు పనిచేయడం లేదు. దీంతో మండల ప్రజలందరికీ ఒక ఆధార్ నమోదు కేంద్రమే దిక్కయింది. సమస్య తీవ్రత దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బేస్తవారిపేట, పూసలపాడు సచివాలయాల్లో ఆధార్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వరా?

- రాచర్లలో అధికారులను ప్రశ్నించిన ఎంపీపీ ఖాశింబి
- అర్ధంతరంగా నిలిచిపోయిన సర్వసభ్య సమావేశం


సమావేశం నుంచి బయటికి వచ్చిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు

రాచర్ల: తమను ప్రజాప్రతినిధులుగా గుర్తించలేని పక్షంలో సర్వసభ్య సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను ఎంపీపీ షేక్ ఖాశింబి ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ పగడాల దేవి, ఎంపీటీసీలు విమలాదేవి,టి. సుబ్బారాయుడు, నందం రవి, భవనం ధనమ్మ, చిట్టెం ఎలిశమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకవీడు–1 ఎంపీటీసీ పోతిరెడ్డి విమలాదేవి మాట్లాడుతూ.. ఎంపీపీ నిధుల మంజూరు, ఖర్చుల విషయంపై ఎలాంటి సమాచారం లేదని, మాకు ఎలాంటి సమాచారం లేకుండా టీడీపీ నాయకుల పెత్తనంతో అధికారులు పనులు చేస్తున్నారని, పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయకుండా అడ్డుపడుతున్నారని, పనులకు సంబంధించిన తీర్మానాలు కూడా బయటికి చెప్పకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు రిజిస్టర్‌లో సంతకాలు చేయకుండా సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి బయటికి వచ్చారు.

నేడు సర్వసభ్య సమావేశం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేస్తున్న మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులు ఆగకూడదు


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి


విద్యుత్ సమస్యపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రమేష్ తదితరులు

- అధికారులకు స్పష్టం చేసిన ఎంపీపీ లక్ష్మీదేవి
- ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు
- సమస్యలపై గళం విప్పిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

మార్కాపురం: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కాపురం మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ బండి లక్ష్మీదేవి పేర్కొన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీగా ఎన్నికైన తరువాత సోమవారం మొదటి సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో లేమని మండలంలో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం చూపవద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారమెప్పుడు?

మార్కాపురం మండలంలోని గజ్జలకొండ, కోలభీమునిపాడు, భూపతిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను నెలల తరబడి పరిష్కరించకపోవడంపై వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు సభలో ప్రశ్నించారు. గత సమావేశాల్లోనే సమస్యలను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాలక్షేపం చేస్తున్నారని గజ్జలకొండ ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రమేష్, కోలభీమునిపాడు సర్పంచ్ సుబ్బారెడ్డి, భూపతిపల్లి సర్పంచ్ లాజరస్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. త్రీ ఫేజ్ మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్లు తగినన్ని లేకపోవడం, విద్యుత్ స్తంభాలు, వైర్ల కొరతపై స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్ ఏఈ నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ.. త్వరలో 24 గంటల విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్నామని, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల విషయంలో రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రశ్నించారు. దీనిపై డీటీ శ్రీనివాస్ స్పందిస్తూ వీఆర్‌ఓ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు అందిస్తామని చెప్పారు. ఎంఈఓ రాందాస్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాఠశాలల నిర్వహణ, ఇతర సమస్యలపై సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సౌభాగ్యమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌లో ప్రథమ స్థానం అభినందనీయం

మార్కాపురం టౌన్: జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో జెడ్పీ పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్‌లో మార్కాపురం జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కపురం శ్రీనివాసరెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కన్వీనర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు వనజాక్షి పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 283 మంది విద్యార్థినులను పదో తరగతిలో ఎన్‌రోల్ చేయించి, పరీక్షకు హాజరయ్యేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా విద్యా ప్రమాణాలు పాటిస్తూ మంచిపేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ఇన్‌చార్జి హెచ్‌ఎంను అభినందిస్తున్న వనజాక్షి, శ్రీనివాసరెడ్డి తదితరులు

ఆ గ్రామాల్లో రెండు నెలలుగా రేషన్ బంద్

మార్కాపురం: మండలంలోని కొండేపల్లి, తిప్పాయపాలెం పంచాయతీల్లో గత రెండు నెలలుగా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని కొండేపల్లి ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, తిప్పాయపాలెం వైఎస్సార్ సీపీ నేత బండి కృష్ణారెడ్డి సోమవారం ఆరోపించారు. ఎంపీడీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. పేదలకు బియ్యం, చక్కెర, కంది పప్పు సకాలంలో అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తర్లుపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ హనుమానాయక్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తుమ్మలచెరువు, ఓబాయపల్లె, మంగళకుంట, జగన్నాథపురం, బుడ్డపల్లి, కేతగుడిపి గ్రామాల్లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉమ్మారెడ్డిపల్లి, తాడివారిపల్లి, గొల్లపల్లి, నాగెళ్లముడుపు, రోలుగుంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వివరించారు. ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

పేదల సమస్యలపై పోరాటం


నియామకపత్రం అందుకుంటున్న రామాంజనేయులు

మార్కాపురం: బడుగు బలహీన వర్గాలు ఎదర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల బాబు పేర్కొన్నారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది నూతలపాటి దేవరాజ్ ఆదేశాల మేరకు డివిజన్ సమాఖ్య అధ్యక్షుడిగా మార్కాపురానికి చెందిన అంబడిపూడి రామాంజనేయులును నియమించినట్లు తెలిపారు.

బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు


చికిత్స పొందుతున్న ఆరెపల్లి సుబ్బారావు




గాయాలపాలైన శ్రీరంగ, పాండు

మార్కాపురం: రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం మధ్యాహ్నం మార్కాపురం మండలంలోని చింతగుంట్ల గ్రామంలో చోటుచేసుకుంది. పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామానికి చెందిన ఆరెపల్లి సుబ్బారావు చింతగుంట్ల గ్రామంలో కొలుపులకు తన బైక్‌పై వస్తున్నాడు. ఒంగోలుకు చెందిన శ్రీరంగ, పాండు బైక్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న సుబ్బారావును ఢీకొన్నారు. రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.


అన్నా రాంబాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

వైభవంగా ఎల్లమ్మ కొలుపులు

మార్కాపురం: మండలంలోని చింతగుంట్లలో గ్రామదేవత ఎల్లమ్మ కొలుపులను సోమవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లమ్మ కొలుపులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఇరువురి మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, మందటి శివారెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరిరువురిని సన్మానించారు.


జంకె వెంకటరెడ్డితో గ్రామస్తులు

కార్యకర్త కుటుంబానికి ‘ఉడుముల’ పరామర్శ


రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చప్పిడి రమేష్ ఇటీవల చిలకలూరిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి స్థానిక పార్టీ నాయకులతో కలిసి సోమవారం సాయంత్రం సిద్ధవరంలో రమేష్ తండ్రి చప్పిడి అల్లయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ ఇమ్మానియేల్, మీరావలి, నాయకులు సూరవరపు పెదవెంకటరెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, బాలఅంకయ్య, కె.నాగేశ్వరరావు, నాగిరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు


భక్తులకు అన్న సంతర్పణ


గొట్లగట్టులో గరుడ వాహనం ఉత్సవం

కొనకనమిట్ల: శ్రీరామ నవమి పండగను పురస్కరించుకొని రెండో రోజు సోమవారం మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం, పెదారికట్ల, నాయుడుపేట, రేగడపల్లి, చింతగుంట, వద్దిమడుగు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గొట్లగట్టు, రేగడపల్లిలో గరుడ వాహనంపై సీతారామచంద్ర మూర్తులను ఊరేగించారు. ఆయా గ్రామాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గొట్లగట్టులో చెంచులక్ష్మి పౌరాణిక నాటకం భక్తులను అలరించింది. మంగళవారం రాత్రి గొట్లగట్టులో భక్త చింతామణి పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సీతారాముల గ్రామోత్సవం

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులో గల సీతారామస్వామి ఆలయం వద్ద నుంచి పొట్టిశ్రీరాములు సెంటర్ వరకు గ్రామోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. ఆలయ ఆవరణలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సమారాధన నిర్వహించారు.

446 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం

- ఏడీఏ బాలాజీనాయక్ వెల్లడి


నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ ఏడీ బాలాజీనాయక్ సోమవారం పరిశీలించారు. మండలంలోని బసినేపల్లె, ఎంపీ చెరువు, పీవీ పురం, పూసలపాడు, మోక్షగుండం గ్రామాల్లో ఆయన పర్యటించారు. 446 ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయాధికారి షేక్ బాషా, ఏఓ జక్కం మెర్సీ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది వై.వెంకటలక్ష్మి, ఎస్.రామేశ్వరి, మెట్ల బాలకృష్ణ పాల్గొన్నారు.